# అడ్డుగోడ కూలింది

నేను బాగా అలసిపోయాను. కాళ్ళు ఇంక నడవడానికి శక్తిలేదని మారాం చేస్తున్నాయి. ఒకసారి చేతిలో ఉన్న ప్లాస్టిక్ బాగ్ కేసి చూసుకున్నాను. సబ్బులు సగానికి పైగానే అమ్మగలిగాను. ఉన్న ఈ కొన్ని కూడా అమ్మేస్తే తేలిగ్గా గాలి పీల్చుకోవచ్చు. కాని కాళ్ళు ముందుకు సాగటం లేదు. నాలుక పిడచగట్టుకుపోతోంది. గొంతుక తడికోసం ఆత్రపడుతోంది. సూర్యుడు తన ప్రతాపమంతా నా మీదే చూపిస్తున్నాడేమో అన్నట్టుగా ఉంది ఎండ తీక్షత.

ఏం చేయడానికీ పాలుబోక కాసేపు రోడ్డు మీద నిలబడి చుట్టూ కలియచూశాను. కొద్ది దూరంలో అందమైన చిన్న డాబా ఇల్లు ఉంది. రెండడుగులు వేస్తే ఆ యింటిని చేరుకోవచ్చు. గొంతు తడి చేసుకోవచ్చు. ఆ ఇంటివైపు నడిచాను. గేటు మూసి ఉంది.

గేటుతలుపు 'తియ్యాలా వద్దా' అనే సందిగ్ధావస్థలో క్షణకాలం అలాగే నిలబడ్డాను.

చివరికి గేటు పైనున్న గొళ్ళాన్ని తీసి లోపలికి అడుగుపెట్టాను. నేను ఆశ్చర్యపోతూ అలాగే నిలబడ్డాను. ఆ ముంగిలిలో ఉన్న పూలచెట్లు నన్ను ఆకర్షించాయి.

భగవంతుడు భూమి మీద సృష్టించిన పూలన్నీ ఆ ముంగిలిలో విరజిమ్మినట్టుగా ఉంది. అవి యవ్వనంలో ఉన్న అందమైన కన్నెపిల్లలు అందాల పోటీకి నిలబడ్డట్టుగా తమ చక్కదనాలనూ సౌరభాలనూ కుమ్మరిస్తున్నాయి. ఆ చెట్ల మధ్యలో డాబావైపు వెళ్ళడానికి సన్నని సిమెంట్ దారి వేసి ఉంది.

నేను తదేక ధ్యానతో ఆ పూలచెట్లనే చూస్తూ నిలబడ్డాను.

నాలో పూర్వం ఉన్న అలసటపోయి ఏదో కొత్త శక్తి ప్రవేశించినట్టుగా ఉంది.

అలా ఎంతసేపు నిలబడ్డానో నాకే తెలియదు.

"ఎవరు కావాలమ్మా?" ఎవరిదో కంఠం వినబడ్డంతో ఉలిక్కిపడి ఆ ధ్వని వచ్చిన వైపు చూశాను.

డాబా ఇంటి గుమ్మంలో ఒక ముసలావిడ నిలబడి నా వైపే చూస్తోంది. ఆవిడకు సుమారు అరవై ఏళ్ళు ఉండవచ్చునేమో! తల ముగ్గుబుట్టలా ఉంది. పచ్చటి పసిమి ఛాయలో, చక్కటి కనుముక్కు తీరుతో ఈ వయసులో కూడా 'అందమైనదే' అనుకునేట్టుగా ఉంది. చూడగానే సౌమ్యంగా ఇతరులకు తనయందు గౌరవభావం కలిగేట్టుగా ఉంది ఆవిడ ముఖ వర్చస్సు.

ఆవిడ వేసిన ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో క్షణకాలం తోచలేదు నాకు.

"మంజుల కావాలా?" మళ్ళీ తానే ప్రశ్నించింది.

ఆ మంజులెవరో నాకేం తెలుసు. బహుశా ఆవిడ కూతురై ఉండచ్చు. లేకపోతే కోడలై ఉండచ్చు. అయినా ఆ మంజుల ఎవరైతే నాకేం?

"నా పేరు పావనండీ. దాహం వేస్తోంది. మంచినీళ్ళు ఇప్పిస్తారేమోనని ఇటు వచ్చా" అన్నాను నన్ను నేను పరిచయం చేసుకుంటూ.

"అలాగా! ఇంట్లోకి రామ్మా!" మర్యాదగా ఆహ్వానించింది ఆవిడ. ఆ మర్యాదకు ఉప్పొంగిపోయి, ఆవిడ వెనకే లోపలికి నడిచాను.

ఇంతకు ముందు ఇలాంటి పరిస్థితే ఒకసారి తటస్థించింది. ఒక ఇల్లాలి ఇంటి గుమ్మం దగ్గర నిలబడి "కాసిని మంచినీళ్ళు ఇప్పిస్తారా అమ్మా" అని నమ్రతగానే అడిగాను.

ఆవిడ తాచుపాములా ఒక్కసారి బుస్సుమంది. నేను హడలిపోయాను. నేనేం తప్పు చేశానో నాకర్థం కాలేదు.

"ఇలా ఇళ్ళల్లోకి జొరబడడమేనా? మంచి, మర్యాదా ఉండక్కర్లా? అందం ఉండగానే సరికాదు. అయినా కుక్కలా జొరబడడమెందుకు— ఎదురుగుండా దున్నపోతులా కుళాయి కనిపిస్తుంటేను?"

ఏకబిగిన ఆవిడ అలా దులిపేస్తుంటే నా మనసు చివుక్కుమంది. కోపం కూడా వచ్చింది. అందులో నేను చేసిన తప్పేం లేదు. గుమ్మంలో నిలబడి ఉన్నాను. అనుకోని విధంగా ఆవిడ అలా సాధించడం నాకు అవమానంగా తోచింది.

అందుకే ఆనాటి నుంచి ఎవరింటికైనా వెళ్ళి మంచినీళ్ళు అడగాలంటే కొద్దిగా జంకుగానే ఉంటుంది.

"ఇలా కూర్చో అమ్మా" నా ఆలోచనల నుంచి ఇవతలపడి ఆవిడ చూపించిన సోఫాలో కూర్చున్నాను.

"ఒసేవ్ రంగీ....ఒక గ్లాసుడు మంచినీళ్ళు పట్టుకురా" ఆజ్ఞను జారీ చేసిందావిడ. ఆవిడతో ఏం మాట్లాడాలో నాకు తోచలేదు.

గదినంతా పరిశీలనగా చూశాను. అదో పెద్ద హాలు. హాలుకు నాలుగువైపులా అందమైన పెయింటింగ్స్ అమర్చబడి ఉన్నాయి.

రంగి మంచినీళ్ళు తెచ్చి టిపాయ్ మీద పెట్టింది. నేను గడగడా తాగేశాను.

"ఇంకాసిని పొయ్యమంటావా అమ్మా?" ఆప్యాయంగా అడిగిన ఆ తీరు నన్ను కొద్దిగా ఆశ్చర్యపరిచింది. ఇంకో గ్లాసుడు పోయించుకున్నాను. నాలో పారిపోయిన బలం తిరిగి పుంజుకుంది.

"అమ్మయ్య" అన్నాను అప్రయత్నంగానే— గ్లాస్ టీపాయ్ మీద పెడుతూ.

"బాగా అలిసిపోయినట్టున్నావ్!" సాను



భూతిగా నా వైపు చూస్తూ అన్నది ఆవిడ. నేను చిన్నగా నవ్వి ఊరుకున్నాను.

నేను వచ్చిన దగ్గర నుంచి ప్రతి క్షణం ఆవిడ నన్నే గమనిస్తూ ఉండడాన్ని ఒక కంటితో కనిపెడుతూనే ఉన్నాను. నేను అందంగానే ఉంటాను—నిజమే! కాని నా మీద నుంచి దృష్టి మరల్చుకోలేనంత బలీయమైన ఆకర్షణేదో నాలో ఉండి ఉండాలి.

ఏది ఏమైనప్పటికీ ప్రస్తుతం ఆవిడతో నా వ్యాపారాన్ని కొనసాగించి త్వరగా బయటపడాలి.

బాగ్‌లోంచి సబ్బులు తీస్తుండగా ఆవిడ అడిగింది: "ఎక్కడుంటారమ్మా" అని.

"ఖైరతాబాద్‌లో" అన్నాను సమాధానంగా.

నేను సబ్బు తీసి ఆవిడకు చూపించబోతుంటే, "ఖరీదెంత?" అని అడిగింది. చెప్పాను.

"దీంతో బట్టలు వాష్ చేస్తే తళతళ మెరుస్తున్నట్టుగా ఉంటాయి. ఒక్కసారి బట్టకు పట్టిస్తే చాలు నురుగొస్తుంది. మిగతా సబ్బుల్లా చేయి నొప్పి పుట్టేలా రుద్దక్కరలేదు." సబ్బు ఆధిక్యతను




తెలుపుతూ అన్నాను. ఆవిడ సబ్బును పరిశీలనగా చూసి పక్కన పెట్టింది.

"మీ నాన్నగారు ఏం చేస్తుంటారు?" మళ్ళీ మాటల్లోకి దింపింది. ఈవిడకు ఒక సబ్బు అంటకట్టి, బయటపడాలని నా ఉద్దేశం. కంపెనీకి డబ్బు చెల్లించవలసిన టైమ్ దగ్గర పడుతోంది. ఇంకా అమ్మవలసినవి ఉన్నాయి.

"లేరండీ పోయారు" అన్నాను నెమ్మదిగా.

"అలాగా" ఆవిడ నావైపు జాలిగా చూసింది. ఇంకా కూర్చుంటే అనేక విషయాలు బయటకొస్తాయి. అందుకే లేచాను.

"వెళ్ళొస్తానండీ" అన్నాను.

ఆవిడ నా ఉద్దేశం గ్రహించినట్టుంది.

"మంజులా" అంటూ పిలిచింది.

ఇంతకుముందే ఆ పేరుతో పరిచయం ఉండడంతో ఆవిడను చూడాలనే ఆసక్తి నాలో కలిగింది.

"ఆఁ వస్తున్నా" లోపలి నుంచి సన్నని కంఠం వినబడింది. నేను ఆమె రాక కోసం ఎదురు చూస్తూ నిలబడ్డాను.

మరుక్షణమే ఆమె హాలులోకి వచ్చింది.

ఆమెను పరిశీలనగా చూశాను. అంత తెలుపు కాకపోయినా చామనఛాయలో చూడడానికి చాలా ఆకర్షణీయంగా ఉంది మనిషి. ఆవిడవెంట ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు—మొగపిల్లవాడూ, ఆడపిల్ల.

నేను ఆడపిల్ల వైపు పరిశీలనగా చూశాను. నాకు సుపరిచితమైన పోలికలేవో ఆ పిల్లలో ముద్రించినట్టుగా కనిపించాయి.

"ఏమిఁటి అలా చూస్తున్నారు?" నేను పాపకేసి తదేక ధ్యాసతో చూడడం గమనించి, నవ్వుతూ ప్రశ్నించింది మంజుల.

"పాప చాలా బాగుందండీ!" అన్నాను.

"మమ్మీ, ఈవిడెవరు ఆంటీయా?" తల్లిని ప్రశ్నించింది పాప.

"అవును మీ చంద్ర ఆంటీ లేదు అలాగన్నమాట" అంది మంజుల.

"బాగుంది కదూ?" అని పాప తల్లితో రహస్యంగా అనడం నాకు వినిపించక పోలేదు.

"బేబీ వరస కూడా కలిపేసింది. నిజంగానే నిన్ను చూడగానే పోయిన నా కూతురు తిరిగొచ్చిందనిపించింది" అంది ముసలావిడ ఈసారి నా వైపు ఆప్యాయంగా చూస్తూ.

నేను టైమ్ చూసుకున్నాను. ఇంకో గంటలో—ఉన్నవి సేల్ చేయాలి. ఇక్కడినుంచి త్వరగా బయట పడాలి.

"ఇంక నాకు సెలవిప్పించడమ్మా" అన్నాను- మంజులకూ ఆవిడకూ నమస్కరిస్తూ.

మంజుల పర్స్‌లోంచి డబ్బు తీసి నా చేతిలో పెట్టింది.

బయలుదేరబోతుంటే "అప్పుడప్పుడు వస్తూ ఉండమ్మా" అన్నది ముసలావిడ. నేను సంతోషంగా 'అలాగే'నని తల ఊపి పాపను, బాబును ముద్దు పెట్టుకుని బయటపడ్డాను.

టైముకు చేరుకోవడం కోసం పరుగులాంటి నడకను సాగించేను. మధ్యలోనే నా నడకకు ఆటంకం కలిగింది.

అప్పుడే కారులోంచి దిగి, హడావిడిగా లోపలికి పోబోతూ నన్ను 'ఢీ' కొట్టాడా వ్యక్తి. నేను ఉలిక్కిపడి తలెత్తాను. అంతే! అచేతనంగా క్షణకాలం అలా చూస్తూండిపోయాను.

'అతను .... అతను—సతీష్' నా శరీరం జలదరించినట్టైంది.

"నువ్వా?" నిర్విణ్ణుడై అన్నాడతను. నేనేం సమాధానం చెప్పలేదు. అతన్ని తప్పించుకుని ముందుకు సాగిపోయాను.

మళ్ళీ జీవితపథంలో అతను ఇలా కలుస్తాడని నేను అనుకోలేదు. నా మనసంతా అస్తవ్యస్తంగా తయారైంది.

యాంత్రికంగా నా పనిని నేను చేసుకుని ఇంటికొచ్చాను. నా ముఖం నీరసంగా, వాడిపోయి

నట్టుందేమో! "అలా ఉన్నావేమిటే!" అని ప్రశ్నించింది అమ్మ ఇంట్లోకి అడుగు పెట్టగానే.

"కాస్త తల నొప్పిగా ఉంది" అని నా గదిలోకి వెళ్ళి, బట్టలు మార్చుకుని మంచం మీద వాలిపోయాను. అమ్మ కాఫీ కప్పు తీసుకుని వచ్చింది. ఆమె చేతిలో ఒక కవరు కూడా ఉంది.

"ఎక్కడి నుంచి ఉత్తరం?" కాఫీ కప్పు అందుకుంటూ అడిగేను. "అరుణ రాసింది" ఉత్తరాన్ని అందిస్తూ అన్నది అమ్మ. నేను కాఫీ తాగుతూనే ఉత్తరాన్ని విప్పి చదివాను. అమ్మ వంటింట్లో పనుందంటూ అక్కడి నుంచి వెళ్ళి పోయింది.

ఎప్పుడూ పాడేపాటే! తన ఎరికన ఒక సంబంధం ఉందని రాసింది. 'మోడులా ఎంత కాలం ఇలా బ్రతుకుతావు? మొగుడనేవాడి నీడన ఉండాల్సిన నీ జీవితం ఇలా ఒంటరిగా సాగి పోవడం నాకు బాధగా ఉంది. ఏనాడైనా ఆడదాని జీవితం మొగాడితో ముడిపడవలసిందే. ఇప్పుడున్న సంబంధం రెండో పెళ్ళివాడు. కాని చాలా మంచి వాడు. ఈడూజోడూ కూడా బాగుంటుంది. నువ్వు అంగీకరిస్తావని ఆశిస్తున్నాను' — ఇది ఆ ఉత్తరం సారాంశం.

ఆ ఉత్తరాన్ని డ్రాయర్‌లో పడేసి భారంగా నిట్టూర్చాను. సతీష్ కనిపించిన దగ్గరనుంచి నాలో ఆలోచనల అలలు చెలరేగుతున్నాయి.

ఒకరికి ఒకనాడు అంకితమైన ఈ మనసు ఈనాడు మరో వ్యక్తిని పరిపూర్ణంగా స్వీకరించ గలదా? ఆడదాని హృదయంలో ఒకరికే స్థానం. ఈనాడు నేను పెళ్ళి చేసుకున్నా సంపూర్ణమైన వైవాహిక జీవితాన్ని గడపలేనేమో! అయినప్పటికీ ఆ జీవితంలోకి ప్రవేశించక తప్పదు. ఈ యాంత్రిక జీవితం విసుగనిపిస్తోంది. ఒక నీడపట్టున ఉండి విశ్రాంతి తీసుకోవాలనిపిస్తోంది.

ఒకొక్కప్పుడు నా పరిస్థితులను తలచుకుంటే నామీద నాకే జాలి కల్గుతుంది. నాన్న మన స్తత్వం తెలిసికూడా అతన్ని అంత మూగగా ఆరాధించడం నాదే తప్పు. కాని అప్పటి ఆ వయసు, ఆ మనస్సు ఏదో అందుకోవాలనే ఆత్రుత చూపేవి. ముందు వెనుక ఎటువంటి పరిస్థితులున్నాయో తెలుకోలేని ఆవేశం అందులో ఉండేది. పరుగెత్తే వయసు, నిలువని మనస్సు ఈ రెంటి మధ్యా యవ్వనం ఏ దిశకు పయనిస్తోందో తెలియని అయోమయ స్థితిలో ఉండేది.

నా ఆలోచనలు పదిహేనేళ్ళ వెనక్కి వెళ్ళి జ్ఞాపకాలను త్రవ్వి తీసుకొచ్చి నాముందర పెట్టాయి.

*

మాదో మధ్య తరగతి కుటుంబం. తినే తిండి, కట్టే బట్ట బొటాబొటిగా సరిపోయే స్థితి మాది. ఏనాడో తాతలు మాకిచ్చి వెళ్ళిన గూడు మాత్రం మాకు నీడనిచ్చి కాపాడుతోంది. నాన్నలో నిప్పును కడిగించే ఆచారం ఉండేది. కులం, మతం అనే మూఢవిశ్వాసాలు ఆయనను అంటిపెట్టుకుని ఉండేవి. అమ్మలో కూడా అలాంటి మూఢ విశ్వాసాలు లేకపోలేదు.

అప్పుడే యవ్వనం నాలో ప్రవేశిస్తున్నది.

"ఇలాంటి బంగారాన్ని చూసి ఎవరు వదులు కుంటారండీ? 'కట్నం మాట దేవుడెరుగు, ఆపిల్ల మా ఇంటి కోడలైతే చాలు' అనుకోరూ?" అనేది అమ్మ సంబరపడిపోతూ.

"అమ్మాయిని మంచి సంప్రదాయమైన కుటుం బంలోని వరుడికి ఇవ్వాలే" అనేవారు నాన్నగారు.

పదోక్లాస్ పాస్ కావడంతో నా విద్యార్థి దశ ముగిసింది. నేను కాలేజీలో చేరడానికి నాన్నగారు ఏ మాత్రమూ ఇష్టపడలేదు. ఏదో ఒక సంబంధం కుదిర్చి త్వరగా పెళ్ళి చెయ్యాలని ఆయన ఆత్రం.

ఆయనను ఎదిరించి కాలేజీలో చేరే ధైర్యం నాలో లేదు. నాన్న అంటే నాలో జాలి, ప్రేమ, భయం ఉన్నాయి. కొన్ని కొన్ని సమయాల్లో ఆచార వ్యవహారాల్లో నాన్నగారిని చూస్తే కోపం వచ్చినా, అది నాలో ఆట్టేసేపు నిలిచేది కాదు. చాలీచాలని జీతంతో మా జీవితాల్ని ఒక ఒడ్డుకు చేర్చే నాన్న అంటే నాకు జాలి. నేను చదివినా, నాకు పెళ్ళి చేయక తప్పదు. చదువుకు, పెళ్ళికి ఖర్చు పెట్టగల స్తోమత నాన్నకు లేదు. అందుకే మౌనంగా ఊరుకోవడం తప్ప, ఏమి చేయలేక పోయాను.

"అక్కా నువ్విలా పిరికి సన్నాసిలా ఉండి పోయావు కాని, నేనే ఆ పరిస్థితిలో ఉంటే, ఎదిరించైనా కాలేజీలో చేరుదును" అన్నది అరుణ ధీమాగా నాతో.

"చాల్లేవే, ఆ సమయం వస్తే నువ్వు నాలాగే ఆలోచిస్తావ్" అన్నాను.

*

వైవాహిక జీవితం గురించి బంగారు కలలు కనే రోజుల్లో అతను నన్ను బాగా ఆకర్షించాడు. మొదటిసారిగా అతణ్ణి చూసిననాడు నా జీవితంలో భాగం పంచుకునే వ్యక్తి ఇలా ఉండాలనుకున్నాను. తరువాత కొంతకాలానికి 'అతడే నా భాగస్వామి అయితే' అనుకునేదాన్ని. అలా అనుకున్నప్పు డల్లా నా శరీరం జలదరించేది.

అతను మా ఇంటికి ఎదురుగా ఉన్న డాబాలో ఒక గదిలో అద్దెకుంటున్నాడు. ఒక రోజు మా యింటి కిటికీ తెరవగానే ఎదురింటి బాల్కనీలో అతను కనిపించాడు. అతణ్ణి చూడగానే అతని రూపం నాలో చెరగనిముద్ర వేసింది. అతని కళ్ళల్లో ఉన్న చురుకుదనం నన్ను ఆకర్షించింది. ప్రతి రోజూ అతను బాల్కనీలో నిలబడ్డ సమయానికి కిటికీ తలుపులు తెరిచి అతనికేసి కాసేపు చూడడం నాకు పరిపాటి అయింది. అతను నన్ను చూస్తున్నాడో లేదో తెలియదుగాని, నేను మాత్రం ప్రతి రోజూ అతన్ని చూడందే ఉండలేక పోతున్నాను. అతని చుట్టూ నా ఊహలు పూల తీగల్లా అల్లుకు పోతుండేవి.

మా తమ్ముడు సుందర్‌కి అతనితో పరిచయం అయింది. సరదాగా కబుర్లు చెప్పడమంటే అతనికి మహా ఇష్టమట. అతను చదువుకోసం ఇక్కడికి వచ్చినట్టు తెలిసింది.

"అక్కా! అతను మంచి, మంచి బొమ్మలు వేస్తాడే. కథలు కూడా రాస్తాడట" అన్నాడు సుందర్ ఒకనాడు. అతని పేరు సతీష్‌ట. అతని చిత్రాలు, కథలు, చాలా పత్రికల్లో చూశాను. అతని కథల్ని నేను బాగా 'లైక్' చేస్తాను. ఆనాటి నుంచి అతడు నా దృష్టిలో

> "తెలుగు యువిదల ప్రాచీన చరిత్ర సామాన్యమైనదిగాదు. రాజ్యముల పాలించుటయందేమి, రాజ్య తంత్రముల నడుపుటయందేమి, కావ్యముల విరచించుటయందేమి, శాస్త్రముల పరిశీలించుటయందేమి, పరమార్థ విచారమందేమి—సర్వ విషయములందును ఆంధ్ర స్త్రీలు విఖ్యాతి గడించియున్నారు."
>
> —కనుపర్తి వరలక్ష్మమ్మ

హిమాలయా పర్వతంలా ఉన్నతంగా కనిపించసాగాడు. తమ్ముడి ద్వారా అతన్ని గూర్చి తెలుసుకోవడం నాకు అలవాటైంది.

*

ఆ రోజు కిటికీతలుపు తెరవగానే అతను కిటికీకేసే చూస్తూ నిలబడ్డాడు. నన్ను చూడగానే చిన్నగా నవ్వాడు. కన్నెపిల్ల మనసులో కోటి కాంతులు విరజిమ్మే నవ్వు అది.

ఉలిక్కిపడ్డాను. నా శరీరం జలదరించింది. నాలో ఉన్న అశక్తి నన్ను ప్రతిగా నవ్వనివ్వలేదు. తలుపులు మూసేశాను.

అతన్ని గూర్చి ఆలోచించవద్దనుకున్నాను. నా మనసులోంచి తొలగించాలని ప్రయత్నించాను. కాని సాధ్యం కాలేదు. నేను అతని చుట్టూ అల్లుకున్న లత కూలిపోలేదు. నా కోరికలు అనే నీరు పోసుకుంటూ అది పెరుగుతూనే ఉంది. నేను మూగగా అతన్ని ఆరాధిస్తున్నానని తెలుసుకున్నాను. కాని అది నా వరకే పరిమితం అయింది. నిజానికి అతన్ని కళ్ళెత్తి సూటిగా చూడడానికి కూడా భయపడేదాన్ని. మా ఇద్దరి మధ్య గట్టి పునాదులతో కులమనే అడ్డుగోడను నిర్మించాడు నాన్న. వాటిని కూల్చి సతీష్‌ని అందుకునే శక్తిలేదు.

ఆ తరువాత రెండు రోజుల దాకా నేను కిటికీ తలుపు తెరవలేదు. ఆ రెండు రోజులు నా మనసంతా చీకటి—చీకటిగా ఉంది.

రెండు రోజులు సహనాన్ని ప్రదర్శించినా మూడో రోజు మాత్రం ఆ సహనం గాలిలో దూది పింజలా ఎగిరిపోయింది.

తలుపు తెరిచాను.

నా హృదయంలో వెలుగులు విరిశాయి.

మళ్ళీ అదే నవ్వు....

చూసినకొద్దీ చూడాలనిపించే నవ్వు....

కాని చూడలేని బలహీనత నాలో. అక్కడి నుంచి ఇవతలికొచ్చేశాను. నేను పిరికిదాన్ని, అసలు సిసలైన పిరికిదాన్ని, అశక్తురాల్ని. నా మీద నాకే కోపం. కసి, ద్వేషం పెచ్చు పెరిగాయి....

*

ఆ రోజు సుందర్ గాభరాగా పరుగెత్తుకొచ్చాడు.

''అక్కా!'' పిలుపు విని నేను చదువుతున్న పుస్తకం పక్కనే పడేసి వాడికేసి చూశాను. వాడి కళ్ళల్లో, భయం, ఆందోళన కనిపించాయి.

''ఏవిటి?'' వాడి భయాన్ని చూసి నేను హడలిపోతూ అడిగాను.

''సతీష్‌గారికి బాగా జ్వరం వచ్చింది. పిలిస్తే కూడా పలకటం లేదు!'' అన్నాడు. నేను హడలిపోయాను. నా మనసు నిలవలేదు. వెంటనే పరుగెత్తాలనిపించింది. ఇంట్లో ఎవరూ లేరు. నాన్నగారు ఆఫీసు నుంచి ఇంకా రాలేదు. అమ్మ గుళ్ళోకెళ్ళింది. అరుణ బడి నుంచి రాలేదు. నాకు క్షణం సేపు ఏం చేయడానికీ పాలుపోలేదు. అతనికి అలా ఉందని తెలిసి కూడా నేను తటస్థంగా ఊరుకోలేను. ఇంకొంత సేపటిలో నాన్నగారొస్తారు. ఎలా?

''పదవే అక్కా!'' తమ్ముడు చేయిపట్టుకు లాగాడు. ఇంక వెళ్ళక తప్పదు. వెళ్ళిందే మనసు నిలువదు. వీధి తలుపు వేసి తమ్ముడి వెంట బయలుదేరాను.

సతీష్ మంచం మీద నీరసంగా పడుకుని ఉన్నాడు.

సుందర్ దగ్గరకు వెళ్ళి పిలిచాడు. ఆ పిలుపుకు సమాధానంగా భారంగా మూలిగాడే తప్ప కళ్ళు తెరవలేదు. ఈసారి నేను దగ్గరగా వెళ్ళి రెండు, మూడుసార్లు పిలిచాను. భారంగా కళ్లెత్తి చూశాడు. నీరసంగా ఉన్న ఆ కళ్ళల్లో నన్ను చూడగానే ఆశ్చర్యం తొంగిచూసింది.

''మీరా?'' అతను అడిగాడు.

''ఎన్నాళ్ళ నుంచి జ్వరం?'' అని అడిగాను. అతడిని అంత పరిశీలనగా చూడడం అదే మొదటిసారి.

''నిన్న రాత్రి నుంచీ....హఠాత్తుగా వచ్చి పడింది'' అన్నాడు. ఆ మాటలు కూడా ఎక్కడ్నో



## స్పాంజి బొమ్మలు

స్పాంజితో బొమ్మ చేయటానికి ఒక పోసిబైల్ బొమ్మ, ½ మీటరు ఎరుపురంగు స్పాంజి షీట్, చెమ్కీ పూసలు, మెరిసే పూసలు కొన్ని కావాలి.

చేసే విధానం:- 4 సెం. మీ. వెడల్పు, 16 సెం. మీ. పొడవుగల చార్టు ముక్కను కత్తిరించాలి. దాన్ని క్రింద గుండ్రంగా కత్తిరించి ఈ చార్టు ముక్క ఆకారంలో స్పాంజి షీటును 14 ముక్కలుగా కత్తిరించాలి. కత్తిరించిన ముక్కను మధ్యకు మడిచి పైనుండి అంగుళం వదిలి చెమ్కీ పూస మెరిసే పూస కలిపి కుట్టాలి. క్రిందనుండి అంగుళం వదిలి అలాగే కుట్టాలి. తరువాత పైవరుస క్రింది వరుసకు కుట్టిన మధ్య ఒక చెమ్కీ పూస కుట్టాలి. ఇలా 14 ముక్కలు జాయింట్ చేసి లంగా కుట్టాలి.

5 సెం. మీ. పొడవు, అంతే వెడల్పు ఉన్న ఒక ముక్కను కత్తిరించి, మధ్య ఒక రంధ్రం చేసి బొమ్మకు జాకెట్‌గా కుట్టాలి. 14 సెం. మీ. పొడవు 1 సెం. మీ. వెడల్పుగల బెల్టు ముక్కను నడుము చుట్టు కుట్టాలి.

5 సెం. మీ. పొడవు, 3 సెం. మీ. వెడల్పుగల 5 ముక్కలను జాయింట్ చేసి చిప్స్ కుట్టి తల చుట్టూ అమర్చాలి. మనకు కావలసిన అందమైన బొమ్మ ఏర్పడుతుంది. రెండవ బొమ్మలో 3 సెం. మీ. పొడవు, అంతే వెడల్పు-ఉన్న ఒక సంచీ కుట్టాలి. దానికి సరిపోయే టేపు కత్తిరించుకొని చేతికి వ్రేలాడదీయాలి. ఈ బొమ్మలోలా తలకు సరిపోయిన గుండ్రని ముక్క కత్తిరించి తలకు చుట్టాలి.

సంచి చుట్టూ చిప్స్ పూసలు కుట్టాలి. ఇప్పుడు స్పాంజి బొమ్మ పూర్తి అయినట్లే.

—చిత్తజల్లు కస్తూరి

నూతిలోంచి వచ్చినట్టుగా ఉన్నాయి.

"కాస్త గ్లూకోజ్ కలిపి ఇవ్వమంటారా ?" అలమారులో పెద్ద గ్లూకోజ్ పాకెట్ ఒకటుంది.

"ఊఁ" అన్నాడు అంగీకారం తెలుపుతూ. కొంత గ్లూకోజ్ నీళ్ళల్లో కలిపి అతని చేతికిచ్చాను. గ్లాస్ అందుకుంటూ నావైపు క్షణం చూశాడు. నేను గదినంతా పరిశీలనగా చూశాను. చిన్న గది అయినా నీటుగా ఉంది. గోడలకు అందమైన బొమ్మలు వేలాడదీసి ఉన్నాయి. ఒకపక్క టేబుల్, దాని మీద టేబుల్. లేంప్. దాని కెదురుగా కుర్చీ వేసి ఉన్నాయి.

గ్లాస్ సుందర్ చేతికిచ్చి, "అలా కుర్చీలో కూర్చోండి" అన్నాడు సతీష్ కప్పుకుని పడుక్కోబోతూ.

"పర్వాలేదు...ఇంకాసిని కలిపివ్వమంటారా?" అని అడిగాను. అతనలా ఒంటరిగా జ్వరంతో బాధపడడం నాకు చాలా బాధగా ఉంది.

నాకక్కడే కూర్చోవాలనుంది. కాని గడియారం ముళ్ళు ముందుకు సాగిపోతున్నాయి. నాన్నగారు వచ్చేసమయం అయింది. సతీష్‌ను అలా వదిలి వెళ్ళడానికి మనస్కరించటం లేదు. కాని తప్పదు.

"ఏదైనా అవసరం వస్తే కబురుపెట్టండి నేను వెళ్ళొస్తా" అన్నాను.

"మీకు చాలా శ్రమ ఇచ్చాను" అన్నాడు అతను నేను వెళ్ళబోతుంటే.

"ఇందులో శ్రమ ఏముంది ?" నవ్వుతూ అన్నాను. సుందర్ అక్కడే ఉండిపోయాడు. నేను ఇంటికొచ్చేశాను. నా అదృష్టం బాగుంది నాన్నగారు ఇంకా రాలేదు. అమ్మ, అరుణ కూడా రాలేదు. తేలిగ్గా గాలి పీల్చుకుని ఇంట్లోకెళ్ళాను.

కాని నాకారోజంతా ఆందోళనగానే ఉంది. నిద్రపట్టలేదు. నాన్న అనుమతితో సుందర్ ఆ రాత్రి అక్కడుండిపోయాడు. ఆ మర్నాడు అతను కొద్దిగా కోలుకున్నాడని తెలుసుకున్నాక, నా మనసు కాస్త స్తిమితపడింది.

*

ఆ రోజు సుందర్‌ని తీసుకుని మార్కెట్టుకి వెళ్ళవలసొచ్చింది. నాకు మార్కెట్ లోపలికి వెళ్ళాలంటే మహా చెడ్డ చిరాకు. ఎక్కడో గుహలో ఉన్నట్టుగా చిన్న సందులో వుందా కూరల మార్కెట్టు. సుందర్‌కి ఏవేవి తేవాలో చెప్పి, సంచి ఇచ్చి లోపలికి పంపించి దగ్గరలో ఉన్న పార్కులో కూర్చున్నాను.

నేను అనుకోని విధంగా సతీష్ అక్కడ తారసపడ్డాడు. నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు. నేను ప్రతిగా నవ్వాను.

"ఇప్పుడు ఒంట్లో ఎలా ఉంది ?" అడిగాను.

"బాగానే ఉంది. అన్నట్టు మీరు ఒకరే వచ్చినట్టున్నారే ?" నా సమీపాన కూర్చుంటూ అడిగాడు సతీష్. అతనికి నాకు మధ్య మరో వ్యక్తి కూర్చునే అంత చోటుంది.

"సుందర్ కూడా వచ్చాడు. వాణ్ణి మార్కెట్టులోకి పంపించి నేనిలా వచ్చాను" అన్నాను. కొంతసేపు మా ఇద్దరి మధ్య మౌనం రాజ్యం చేసింది. అతను నా పక్కన అలా కూర్చోవడం, కొంత భయం కలిగించినప్పటికీ ఆనందం కూడా కలిగింది.

"పావనిగారూ" నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఆ పిలుపు వినవచ్చింది. నా పేరు నాకే కొత్తగా, తియ్యగా వినిపించింది. ఏమిటన్నట్టుగా అతనివైపు చూశాను. సూటిగా, అంత పరిశీలనగా అతన్ని చూడడం ఇదే మొదటిసారి. అందమైన నొక్కునొక్కుల జుట్టు. చిలిపిగా, చురుగ్గా ఉన్న చిన్న కళ్ళు. కొనదేలిన ముక్కు. తెల్లని మల్లెపువ్వు లాంటి బట్టలు. అతని చురుకుదనం అతని ముఖంలో ప్రస్ఫుటమవుతోంది.

"మిమ్మల్ని ఒక విషయం అడుగుతాను చెప్తారా ?" అన్నాడు అతను.

"అడగండి" అన్నాను.

"నాకు ప్రతిదీ సూటిగా చెప్పడం అలవాటు" అంటూ తన మనసులో విషయాన్ని బయట పెట్టాడు. తాను నన్ను ప్రేమిస్తున్నాడట! తనపట్ల నా అభిప్రాయం ఏమిటో చెప్పమన్నాడు. నా హృదయం ఆనందడోలికల్లో తేలియాడింది. అతని హృదయంపై వాలిపోయి, "నువ్వే నా సర్వస్వం సతీష్" అనాలనిపించింది. కాని అంతలోనే అగాథంలోకి కూరుకుపోయాను.

మా ఇద్దరి మధ్య ఒక గోడ.

"సారీ సతీష్ మీరు కోరుకునే మనిషి మిమ్మల్ని కోరుకోవాలిగా ? కాని మీ మీద నాకా అభిప్రాయం ఏనాడూ కలగలేదు" అన్నాను. కాని అది పచ్చి అబద్ధం. నేను అతన్ని ప్రేమిస్తున్నానని చెబితే నా జ్ఞాపకాల నుండి బయటపడలేడు. జీవితాంతం నా గురించిన ఆలోచనలతో అతను సతమతం కావడం నాకు ఏ మాత్రమూ ఇష్టం లేదు. అతను, నేను ఈ జన్మలో ఒకటి కాలేము.

నా సమాధానం విని, అతని ముఖంలో కాంతి తరిగి పోయింది. సుందర్ రావడంతో ఏమీ జరగనట్టుగా పరధ్యానంగా, ఎవరిదారివైపు వాళ్ళం వెళ్ళిపోయాము.

కాని ఆ రోజు రాత్రి చీకట్లో–ముక్కలైన హృదయం నుంచి కట్టలు తెంచుకుని ఉబుకుతున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయాను. కుమిలి కుమిలి ఏడ్చాను.

*

ఆ సంఘటన జరిగిన వారం రోజుల తరువాత సతీష్ వెళ్ళిపోయాడన్న విషయం సుందర్ ద్వారా తెలుసుకున్నాను.

ఆ తరువాత కిటికీ తలుపులు తెరవడానికి మనసొప్పలేదు. బోసిగా కనిపించే బాల్కనీవైపు చూడాలనిపించేదికాదు.

జీవితంలో మరో ఆరునెలలు ముందుకు సాగిపోయాయి. నాన్నగారు నాకు సంబంధాలు చూస్తూనే ఉన్నారు. ఒకనాడు అమ్మ చెప్పినట్టుగా ఈ బంగారాన్ని చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఏ కొందరో వచ్చినా చదువు, కట్నం లేని ఆడపిల్ల పెళ్ళికి అనర్హురాలు అన్నట్టుగా ఉండేది వాళ్ళ ధోరణి.

వాళ్ళ అభిప్రాయాలను ఆచరణలో పెట్టలేని నాన్న డీలా పడిపోయ్యాడు. అమ్మ కుమిలి పోయింది.

"ఇద్దరు పిల్లలు స్తంభాల్లా ఎదిగి కూర్చున్నారు. ఈ జన్మలో వీళ్ళకి పెళ్ళి చేయగలమా ?" అంటుండేది అమ్మ–నిరాశగా నాన్నతో.

ఒకొక్కప్పుడు ఆలోచనతో విసిగిపోయిన అమ్మ, "ఎవరినన్నా కట్టుకుని లేచిపోండే! ఈ గుండెల మీద కుంపటికన్న ఆ అపవాదే నయం" అంటుండేది. కొంతసేపటి తరువాత పశ్చాత్తాపంతో మమ్మల్ని పట్టుకుని ఏడ్చేసేది – "మీకు పెళ్ళి కూడా చేయలేని అసమర్థులే మీ తల్లితండ్రులు" అంటూ.

"అక్కా! మన ఇష్టం వచ్చినవాణ్ణి పెళ్ళి చేసుకుంటే అటు అమ్మానాన్నలకూ మన భారం తగ్గిపోతుంది. ఇటు మన జీవితాలూ సాఫీగా గడుస్తాయి" అన్నది ఒకనాడు అరుణ నాతో రహస్యంగా.

నేను ఉలిక్కిపడ్డాను.

"చాల్లే వెర్రిమొర్రి ఆలోచనలూ నువ్వూనూ" అని మందలించాను. మా గౌరవాన్నీ, వంశ ప్రతిష్ఠనూగంగపాలు చేసే భయంకరమైనవ్యక్తిలా కనిపించింది అరుణ నాకు.

"నువ్వు వట్టి సెంటిమెంటల్ ఫూల్‌వి, పిరికి దానివి" అన్నది అరుణ.

*

ఒకనాడు నా పిరికితనాన్ని హేళనచేస్తునట్టుగా, తన ధైర్యాన్ని చాటుతూ, లోకం దృష్టిలో 'లేచిపోయిన'దానిగా, తాను ప్రేమించినవాణ్ణి, తనను కోరుకున్నవాణ్ణి పెళ్ళి చేసుకుని వెళ్ళి పోయింది అరుణ.

అక్కా,

నువ్వు నన్ను అర్థం చేసుకుంటావని ఆశిస్తున్నాను. నిప్పులాంటి వంశాన్ని కూలదోసి, కులం తక్కువ మనిషిని పెళ్ళి చేసుకున్నానని నాన్న బాధ పడతారని నాకు తెలుసు. కాని కులం, మతం అనే స్వల్పవిషయాలకోసం నా ప్రేమను బలి పెట్టడం నాకు ఇష్టం లేదు. ఇది నా స్వార్థమే కావచ్చు. తాను కోరుకున్నవాడు, తనను ఆరాధించే వాడు భర్తగా లభించడం కన్నా ఆడదాని జీవితంలో అదృష్టానికి నిర్వచనం ఏముంటుంది? అందుకే మాధవ్‌ను పెళ్ళి చేసుకున్నాను. అతనిలో ఉన్న సంస్కారం నన్ను బాగా ఆకర్షించింది. రూపసి కాకపోవచ్చు కాని—అంతకుమించిన మంచితనం అతనిలో ఉంది. నా వైవాహిక జీవితం నందన వనం కావాలని ఆశీర్వదిస్తావని ఆశిస్తున్నాను.

ఇట్లు

అరుణ

అది చదివిన నా కళ్లు సజలమైనాయి.


"కులం అనే అడ్డుగోడను కూల్చిన నీలాంటి ధైర్యవంతులు నా లాంటి పిరికిపందలకు ఊపిరి పొయ్యాలి" అనుకున్నాను.

ఆ ఉత్తరం చూసిన నాన్నగారు బాధపడక, సంతోషించడం నన్ను ఆశ్చర్యపరిచింది.

అమ్మ మాత్రం అరుణ ఎంతో తలవంపులు తెచ్చిందని కుమిలి కుమిలి ఏడ్చింది.

"సూర్యం ఎందుకే ఏడుస్తావ్? మనం చేయలేని పనిని అది చేసుకుని వెళ్ళిపోయింది" అని అమ్మను ఊరడించారు నాన్న.

"మన వంశ ప్రతిష్ఠను గంగపాలు చేసిం



పెళ్ళికి 'వయసుతో పని ఏముంది?' అని అడగడం ఒక ఎత్తు. అలా అడగకుండానే 13 ఏళ్ళ అబ్బాయి—నలుగురు పిల్లల తల్లి అయిన 53 ఏళ్ళ ఆమెను పెళ్ళాడడం ఒక ఎత్తు. అందువల్లే కేరళలో తిరుచ్చూరు జిల్లాలోని మంతలమ్మణ్ణు అన్న గ్రామంలో మజీద్ అన్న అబ్బాయి అచ్చు ఉమ్మ అన్న ఆమెను పెళ్ళి చేసుకోవడం పెద్ద విచిత్రంగా చెప్పుకుంటున్నారు. అచ్చు ఉమ్మకు ఇది "నాలుగో పెళ్ళి మాత్రమే" అని వార్త!

దండీ. ఇంత అఘాయిత్యం చేస్తుందని అనుకోలేదు."

"ఇప్పుడు ఏమైందని? శుభమా అంటు పెళ్ళి చేసుకుంది. ఏ కులంవాడైతేనేం, మంచివాడైన ప్రతివాడూ ఉన్నత కులస్థుడే."

ఆ మాటలు విని అందరం విస్తుపోయాం.

'నాన్నగారేనా ఆ మాటలు అంటున్నది?' అనుమానంగా చూశాను.

అవి మనస్ఫూర్తిగా అంటున్న మాటలు.

నాన్న కళ్ళల్లో ఏదో కొత్త వెలుగు గోచరించింది నాకు.

ఆలోచించి చూస్తే నాన్నగారి ఆ ధోరణికి ఆశ్చర్యపోనక్కరలేదు. తాను కన్న కూతుళ్ళకు పెళ్ళి చేయలేని అశక్తుడు. కన్న పిల్లలకు ఒక నీడ నేర్పరచవలసిన తన బాధ్యతను నెరవేర్చుకోలేకపోయారు. వాళ్ళంతట వాళ్లు నీడ నేర్పరుచుకుంటే ఆయన కాదనలేదు.

నాకూ సతీష్‌కూ మధ్యనున్న అడ్డుగోడ కూలిపోయింది. కాని ఫలితం మాత్రం శూన్యం. అక్కడ సతీష్‌లేదు. అప్పటికే అతనికి పెళ్ళైన విషయం సుందర్ ద్వారా నాకు తెలుసు.

*

నాన్నగారు పోయారు. ఇంటి బాధ్యత నా మీద పడింది. ఉద్యోగంలో చేరవలసి వచ్చింది. నా పదోక్లాస్‌కు తగ్గ చిల్లర ఉద్యోగాలు చేస్తూ తమ్ముణ్ణి చదివించాను. ఈ మధ్య కాలంలో పెళ్ళిని గూర్చిన ప్రస్తావన మర్చిపోయినట్టుగా ఉంది అమ్మ. సతీష్‌ను నిలుపుకున్న హృదయం మరొకరికి స్థానం ఇవ్వడానికి అంగీకరించలేదు.

తమ్ముడికి ఉద్యోగం దొరికిన తరువాత మళ్ళీ నా పెళ్ళి ప్రసక్తి తెచ్చింది అమ్మ.

"ఏమే ఇంకా ఎన్నాళ్ళిలా?" అన్నది ఒకనాడు.

"నా జీవితం ఉన్నంతకాలం!" మొండిగా సమాధానం చెప్పాను.

"నువ్వు ఆడదానివన్న సంగతి గుర్తుందా? ఏనాడో ఒకనాడు భర్త అనే కల్పవృక్షఛాయకింద ఉండేనే గౌరవం!" మందలిస్తూ హితబోధ చేసింది అమ్మ.

ఆ తర్వాత ఎప్పుడు నా పెళ్ళిమాట వచ్చినా నేను ఆ ప్రస్తావనను అంతటితో తుంచేసేదాన్ని.

కాని, ఆలోచించిచూస్తే అమ్మ అంటున్న దాంట్లోనూ, అరుణ రాసిన దాంట్లోనూ కొంతలో కొంత సత్యం లేకపోలేదు. అయిపోయినదానికి చింతించడం కన్నా, ప్రస్తుత జీవితంతో రాజీ పడడం మంచిది. నాకు ఒక నీడలో విశ్రాంతి తీసుకోవాలనుంది. ఇన్నాళ్ళు ఎండలో పయనించిన జీవితం నీడకోసం తహతహలాడుతోంది. నేను పెళ్ళి చేసుకునే వ్యక్తి నుంచి నేను ఆశించేది కేవలం నీడ మాత్రమే.

నాకా సంబంధం ఇష్టమేనని చెల్లెలికి రాయాలన్న దృఢనిశ్చయంతో లేచి కూర్చున్నాను. □